

సీపీఐ నేత సత్యాంజనేయకు మాతృవియోగం

నివాళులర్పించిన సీపీఐ నాయకులు

విశాలాంధ్ర - మల్కాపురం: సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కామ్రేడ్ కె.సత్యాంజనేయ మాతృమూర్తి కె.శుభమ్మ (80) శుక్రవారం ఉదయం 10.30 గంటలకు మృతి చెందారు. పద్మనాభ నగర్, ఆర్ఆర్ పురం స్వగృహంలో ఈమె భౌతిక ఖాయాన్ని సందర్శనార్థం ఉంచారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, రాష్ట్ర

కార్యవర్గ సభ్యులు ఎస్.కె.రహమాన్, కో-ఆపరేటివ్ బ్యాంక్ వైస్ చైర్మన్ సిహెచ్ రాఘవేంద్రరావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మరుపిళ్ల పైడిరాజు, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు బూసి వెంకటరావు, సీపీఐ నాయకులు కెంగువ అచ్యుతరావు, భారత సాంస్కృతిక స్నేహ సహకార సంఘం (బిఎస్ఎస్ఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, విశాలాంధ్ర విశాఖ ఎడిషన్ బ్రాంచి మేనేజర్ సనపల నరసింహులు, మహిళా నాయకులు మధుమతి, ఏఐటీయూసీ ఆటో కార్మిక నాయకులు వామనుమూర్తి, పశ్చిమ నియోజకవర్గ సహాయ కార్యదర్శి గుడాల రాంబాబు, మహిళా సమైక్య నాయకులు ఎంఏ బేగం, వనజాక్షి, పుష్పలత, కార్యకర్తలు కె.శుభమ్మ భౌతిక ఖాయాన్ని సందర్శించి ఘన నివాళులర్పించారు.

రాష్ట్ర ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: విశాఖ జిల్లాలో ఒకరోజు పర్యటనలో భాగంగా వాయుమార్గం ద్వారా శుక్రవారం ఉదయం నగరానికి చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రికి స్థానిక నేతలు, అధికారుల నుంచి ఘన స్వాగతం లభించింది. హెూటల్ రాడిసన్ బ్లూలో జరిగిన ఇంటర్నేషనల్ మీడియేషన్ కాన్ఫరెన్స్‌లో పాల్గొనేందుకు శుక్రవారం ఉదయం 9-08 గంటలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఋషికొండ హెలిపాడ్‌కు చేరుకున్నారు. ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికిన వారిలో జిల్లా ఇన్చార్జి మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, హోం శాఖామంత్రి వంగలపూడి అనిత, పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీ భరత్, సీఎం రమేష్, నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, ప్రభుత్వ విప్ గణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు, శాసనసభ్యులు వల్లా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణమూర్తి, విష్ణుకుమార్ రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, వెలగపూడి రామకృష్ణ బాబు, గంటా శ్రీనివాసరావు, పంచకర్ల రమేష్ బాబు, సుందరపు విజయ్ కుమార్, కె.లలిత కుమారి,

వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, ఇతర అధికారులు ఉన్నారు.

మధ్యవర్తిత్వం ద్వారా వివాదాలకు పరిష్కారం

సీఎం చంద్రబాబు నాయుడు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: న్యాయవ్యవస్థ అత్యంత ముఖ్యమైనదని, దీనిపై ప్రజలకు అపారమైన నమ్మకముందని సీఎం చంద్రబాబు అన్నారు. విశాఖపట్నంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ మీడియేషన్ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఈ సదస్సును ఏసీఐఏఎం, భోపాల్ నేషనల్ లా యూనివర్సిటీ సంయుక్తంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ మధ్యవర్తిత్వం నిర్వహించేందుకు మెలకువలు అవసరమని, దీనిద్వారా సమస్యకు సత్వర పరిష్కారం లభిస్తుందని చెప్పారు. న్యాయం పొందడం తమ హక్కు అని ప్రజలు భావించి కోర్టులకు వస్తుంటారన్నారు. నూతన సాంకేతికత వినియోగంలో భారత్ పరుగులు పెడుతోందన్నారు. క్వాంటమ్ వ్యాలీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయబోతోందని చెప్పారు. అవసరమైన ఎకో సిస్టమ్ తీసుకురావాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. క్వాంటమ్ టెక్నాలజీ కేంద్రంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతున్నామని సీఎం తెలిపారు. మీడియేషన్, ఆర్బిట్రేషన్ ప్రక్రియలే ముఖ్య భూమిక పోషిస్తాయని, అనేక వివాదాలకు మీడియేషన్ ప్రధాన పరిష్కార వేదికగా ఉంటుందని సీఎం చంద్రబాబు అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఆల్టర్నేటివ్ డిస్ప్యూట్ రిజల్యూషన్ ద్వారా న్యాయం అందరికీ అందుబాటులోకి రావటంతో పాటు వేగంగా సమర్థ వంతంగా చేరుతుందన్నారు. విశాఖపట్నంలో జ్యుడీషియల్, మధ్యవర్తిత్వ రంగాలపై చారిత్రాత్మక కాన్ఫరెన్స్ నిర్వహించటం సంతోషదాయకం. ప్రజాస్వామ్యంలో భారతీయ న్యాయవ్యవస్థ ఓ మూల స్తంభం అన్నారు. రాజ్యాంగపరమైన హక్కుల్ని, చట్టాన్ని కాపాడే అత్యంత కీలకమైన వ్యవస్థ. నిబద్ధతకు, నిష్పాక్షికతకు, పారదర్శకతకు పెట్టింది పేరన్నారు. సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ప్రారంభమైన నేషనల్ మీడియేషన్ కాన్ఫరెన్స్ శుక్రవారం ఉదయం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, గౌరవ అతిథిగా సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.ఎస్.నరసింహ, విశిష్ట అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, అతిథిగా రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ హాజరయ్యారు. కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న నేషనల్ లా ఇనిస్టిట్యూట్ యూనివర్సిటీ (భోపాల్) వైస్ ఛాన్సలర్ ప్రొ. ఎస్.సూర్యప్రకాష్, ఏసిఐఏఎం ప్రతినిధి ప్రొ. సూర్యరాజు, టెర్ గిల్ ప్రతినిధి చిత్రా రెంటాల, విశాఖపట్నం జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు, వివిధ కోర్టుల న్యాయమూర్తులు, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, పలువురు న్యాయకోవిదులు, స్థానిక ఎంపీ శ్రీ భరత్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సూపర్ బజార్ మేనేజింగ్ డైరెక్టర్‌గా శ్రీరామమూర్తి బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ సెంట్రల్ స్టోర్స్ లిమిటెడ్ (సూపర్ బజార్) మేనేజింగ్ డైరెక్టర్‌గా వి.శ్రీరామమూర్తి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఆయన పార్వతీపురంలో జిల్లా సహకార శాఖ అధికారిగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. రెండు నెలల క్రితమే ఆయనకు బదిలీ ఉత్తర్వులు జారీ అయినప్పటికీ సాంకేతిక పరమైన కారణాలతో సూపర్ బజార్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించడంలో జాప్యం జరిగింది. ఇక్కడ ఎండిగా పనిచేసిన శ్రీనివాసరాజును ప్రభుత్వం బదిలీ చేయడంతో ఇన్చార్జిగా జిల్లా సహకార శాఖ అధికారి టి.ప్రవీణ వ్యవహరించారు.

శ్రీరామమూర్తి మాట్లాడుతూ సూపర్ బజార్ అభివృద్ధికి శక్తి వంచనలేకుండా కృషి చేస్తానని సంస్థను లాభాల బాటలో నడిపించడంతోపాటు వినియోగదారులకు నాణ్య మైన సరుకులు సరసమైన ధరలకు అందిస్తామన్నారు. ఉన్నతాధికారులు, ఉద్యోగుల సహకారంతో సూపర్ బజార్ కు పూర్వవైభవం తీసుకొస్తామని ముఖ్యంగా జాయింట్ కలెక్టర్, సంస్థ చైర్మన్ మయూర్ అశోక్ సహకారంతో సూపర్ బజార్‌ను ప్రగతి పథంలో ముందుకు నడిపిస్తామని తెలిపారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

జిల్లా ఇన్‌చార్జి మంత్రి డా.డోలా

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలిగి వారిని సక్రమ మార్గంలో నడిపించవలసిన గురుతర బాధ్యత ఉపాధ్యా యులపై ఉందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి డా. డోలా బాల వీరాంజనేయ స్వామి అన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ అంబేద్కర్ అసెంబ్లీ హాల్‌లో విశాఖ జిల్లా గురుపూజోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్ విప్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్, జిల్లా కలక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తదితరులు సర్వేపల్లి రాధాక్రిష్ణన్ విగ్రహానికి పూలమాలలు వేసి, జ్యోతి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డోలా బాల

వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైన దని, మన చారిత్రిక, ఇతిహాసాలలో గురుకులాల వ్యవస్థ ఉందని, గురువుల వ్యవస్థ అతి ప్రాచీనమైనదని మంత్రి పేర్కొన్నారు. మానవనరులు తయారు చేయడంలో ఉపాధ్యాయులది కీలక పాత్ర అన్నారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలలో నూరు శాతం ఉత్తీర్ణులయ్యే విధంగా బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. చిరంజీవిరావు మాట్లాడుతూ పిల్లలను బాధ్యతాయుతమైన పౌరులుగా తయారు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీ భరత్ మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో ఏటా అడ్మిషన్లు పెంచటానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలో ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డి.ఇ.ఓ ప్రేమ్ కుమార్, ఎపిసి చంద్ర శేఖర్, డిప్యూటి డిఇఓ సోమేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస: స్థానిక సన్ స్కూల్‌లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సన్ స్కూల్ కరస్పాండెంట్ కైతపల్లి శ్రీనివాస్, ప్రెసిడెంట్ లక్ష్మీ లావణ్య పాల్గొన్నారు. విద్యార్థులకు దిశా నిర్దేశం చేసేది కేవలం ఉపాధ్యాయులేనని, ప్రపంచంలో తల్లిదండ్రుల తర్వాత గౌరవింపబడే వారు కేవలం ఉపాధ్యాయులేనని వివరించారు. అనంతరం 2024-25 విద్యా సంవత్సరంలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుల్లో 596 మార్కులు సాధించిన విద్యార్థిని పీతల మానసకు 50 వేల రూపాయల చెక్కు, మొమెంటో, 590 నుండి 595 మార్కులు సాధించిన 9 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి 20వేల రూపాయల చొప్పున, 585 నుండి 589 మార్కులు సాధించిన 16 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి 10వేల రూపాయలు చొప్పున చెక్కులను, మొమెంటోలను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో లక్ష్మీ లావణ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయంలోని నాలెడ్జ్ రీసోర్సు సెంటర్‌లో స్వర్గీయ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహం వద్ద నివాళులర్పించిన అనంతరం జరిగిన కార్యక్రమంలో గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎరోల్‌డిసౌజా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. దేశంలోని విద్యారంగం కాలానుగుణ మార్పులకు గురవుతోందని ముఖ్యంగా దశాబ్ధాల క్రిందటి విలువలతో కూడిన విద్యా విధానం స్థానంలో నేడు నైపుణ్యాలను విద్యార్థులలో పెంచడానికి అధ్యాపకులు అధిక దృష్టి సారించాల్సి వస్తోందన్నారు. కార్యక్రమంలో గీతం ప్రో-వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమరావు, గీతం

ఉపాధ్యక్షుడు ఎమ్.గంగాధర రావు, జిమ్‌సర్ ప్రోవైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి, గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వేదవతి, గీతం లైబ్రేరియన్ డాక్టర్ శివప్రసాద్ పాండా తదితరులు పాల్గొన్నారు. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.ఎస్.వి.జయశ్రీనును ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో సత్కరించారు. అలాగే బోధనేతర సిబ్బందిలో ప్రతిభ కనబరిచిన పి.గురుమూర్తి, వి.గురమ్మను సన్మానించారు.

పెదగంట్యాడ: ట్వింకిల్ విద్యానికేతన్‌లో టీచర్స్ డేని ఘనంగా జరుపుకున్నారు. ప్రిన్సిపల్ బి శాంతి మాట్లాడుతూ మన జీవితంలో ఉన్నత స్థానం గురువుకు ఇస్తామని, మనల్ని జ్ఞానవంతులుగా తీర్చిదిద్దడంలో ఒక గురువు కృషి వెలకట్టలేనిదన్నారు. అటువంటి గొప్ప వ్యక్తులను స్మరించుకుంటూ సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజు సందర్భంగా సెప్టెంబర్ 5వ తేదీన భారతదేశంలో టీచర్స్ డే జరుపుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, విద్యార్థినులు, టీచర్లు పాల్గొన్నారు.

యువత సన్మార్గానికి భక్తిభావమే శిరోధార్యం

విశాలాంధ్ర - భీమిలి: యువతకు సన్మార్గాన్ని అందించేది, ఉన్నతమైన విలువలతో కూడిన మార్గాన్ని ఇచ్చేది భక్తిభావమొక్కటేనని ఎగువపేట గ్రామాభివృద్ధి సేవా సంఘం అధ్యక్షులు గంటా నూకరాజు అన్నారు. భీమిలి జోన్ 3వ డివిజన్ ఎగువపేట గ్రామంలో రావిచెట్టు వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద దీపారాధన కార్యక్రమం ఏర్పాటు చేసారు. అధికసంఖ్యలో మహిళలు, యువత, పిల్లలు పాల్గొనే ఈ కార్యక్రమానికి గ్రామాభివృద్ధి సేవాసంఘం నుండి గంటా నూకరాజు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఎగువపేట మండపం వద్ద దీపారాధనకు నాంది పలికిన ఉత్సవ కమిటీ సభ్యులు వాసుపల్లి వీరుబాబు, అల్లిపిల్లి నరేష్, పీరుపిల్లి నాగరాజులను గంటా నూకరాజు అభినందించారు.

ఆర్టీసీ సిబ్బంది నిర్వాకం

ఫ్రీ బస్సు అమలుతో బస్సులు ఆపని వైనం

ప్రయాణికులకు తీవ్ర ఇక్కట్లు

ఆర్టీసీ సిబ్బంది తీరును ఖండించిన అల్లు అప్పలరాజు

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం తునివలస పంచాయతీ పరిధిలో మధుర గ్రామమైన నరసాపురం గ్రామ వాసులు ఆర్టీసీ సిబ్బంది నిర్వాకం వల్ల తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సింహాచలం నుండి విజయనగరం వెళ్లే ప్రధాన రహదారికి రెండు కిలోమీటర్ల దూరంలో నరసాపురం ఉంది. ప్రతిరోజు వేకువజాము నుండి రైతులు, పట్టణానికి పనికి వెళ్లే కూలీలు, చదువుకోడానికి వెళ్లే విద్యార్థులు ఊరు దాటాలంటే ఆర్టీసీ బస్సు ఒక్కటే ఆధారం. గతనెల వరకు నరసాపురం జంక్షన్ వద్ద ఆర్టీసీ బస్సులను యధావిధిగా ఆపేవారు. గత నెల రోజుల నుంచి ఆర్టీసీ సిబ్బంది బస్సులను ఆపకపోగా నరసాపురం జంక్షన్ వద్ద దిగాల్సిన ప్రయాణికులను కూడా తునివలస వద్ద ఆపి దింపిస్తున్నారు. రాత్రి 7 గంటలకు స్వగ్రామానికి వచ్చే ప్రయాణికులు, విద్యార్థులను నరసాపురం జంక్షన్ వద్ద బస్సు ఆపకుండా మరో రెండు కిలోమీటర్ల దూరం అయినా తుని వలస వద్ద బస్సుని ఆపి ప్రయాణికులతో ఆడుకుంటున్నారు. ఇటీవల ఓ విద్యార్థిని పరీక్ష రాయటానికి అని బస్ కోసం ఎదురు చూడగా నరసాపురం జంక్షన్ వద్ద బస్సు ఆపకపోవడంతో ఆ విద్యార్థిని పరీక్ష రాయలేకపోయింది. ఒక సంవత్సరం కాలం పాటు ఆమె కష్టపడిన చదువు అంతా వృధా అయిపోయింది. స్థానిక నాయకులు అల్లు అప్పల రాజు మాట్లాడుతూ ఆర్టీసీ తీరు బాగోలేదని ఒకప్పుడు నరసాపురం జంక్షన్ వద్ద బస్సును ఆపేవారని, కానీ ఇప్పుడు లెక్కచేయకుండా బస్సు ఆపడం లేదని వాపోయారు. ఫ్రీ బస్సు పథకం అమలు చేసినప్పటి నుంచి బస్సులను ఆపకుండా ప్రయాణికులతో ఆడుకుంటున్నారని ఖండించారు.

నరవవానిపాలెంలో భారీ అన్నసమారాధన

విశాలాంధ్ర - పెందుర్తి: పెందుర్తి నియోజకవర్గం పరిధిలోని, జీవిఎంసీ 97వ వార్డు నరవవానిపాలెంలో శ్రీ విఘ్నేశ్వరా ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి వేడుకలు అంగరంగవైభవంగా జరిగాయి. ప్రతీరోజు భక్తిప్రపత్తులతో పూజాదికాలు జరిపిన నిర్వాహకులు శుక్రవారం భారీ అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి పిఏసిఎస్ చైర్మన్ అయితి సింహాచలం, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ ఆర్ఎస్ నాయుడు పాల్గొని అన్నసమారాధనను ప్రారంభించి భక్తులకు ప్రసాద వితరణ చేసారు. కార్యక్రమంలో ఆర్ సురేష్ (బుజ్జి), భక్తిమాల, ఈశ్వర్, సబ్బవరపు రమణ సంఘ సభ్యులు పాల్గొన్నారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని ప్రసాదాలు స్వీకరించారు.

అంధకారంలో ఫుడ్ ఫెస్టివల్..!

- స్టాల్స్‌కి విద్యుత్ అంతరాయం

- తొలిరోజు ఫెస్టివల్‌లో నిర్వహణ లోపం

విశాలాంధ్ర - విశాఖపట్నం: పర్యాటక శాఖ ఆధ్వర్యంలో విశాఖ జిల్లా యంత్రాంగం అధికారికంగా నిర్వహించిన వైజాగ్ ఫుడ్ ఫెస్టివల్ తొలిరోజు విద్యుత్ అంతరాయంతో సందర్శకుల విమర్శలు మూటగట్టుకుంది. శుక్రవారం నుంచి మూడు రోజులపాటు విశాఖ బీచ్ రోడ్డు దరి ఎంజీఎం పార్కులో విశాఖ ఫుడ్ ఫుడ్ ఫెస్టివల్ ఏర్పాటు చేశారు. నగరంలోని పలు స్టార్ హోటల్ సహా పెద్ద ఎత్తున హెూటల్‌లు స్టాల్స్ ఏర్పాటు చేశారు. శుక్రవారం సాయంత్రం 6:00కి అతిథులు చేతుల మీదుగా ప్రారంభించాల్సి ఉండగా అధికారులు రావడం ఆలస్యం కావడంతో, వారు రాకుండానే ప్రారంభించేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నప్పటికీ, ప్రజల స్పందన బాగున్నప్పటికీ నిర్వహణ లోపంతో ఫుడ్ ఫెస్టివల్ విమర్శల పాలైంది. ప్రధాన వేదిక వద్ద విద్యుత్ ఇబ్బందులు లేనప్పటికీ, అన్ని స్టాల్స్‌కి ప్రారంభ దశలోని విద్యుత్ అంతరాయం ఏర్పడింది. తరువాత పదే పదే స్టాల్స్‌కి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో సందర్శకులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పూర్తి ప్రైవేట్ కార్యక్రమం అయినప్పటికీ జిల్లా యంత్రాంగం పర్యాటకశాఖ ఆధ్వర్యంలో ఎంతో ఆర్భాటంగా నిర్వహించిన ఈ ఫెస్టివల్‌కు కనీసం అవసరంగా ఉండాల్సిన విద్యుత్తు సదుపాయాన్ని కూడా నిర్వాహకులు సరిగా ఏర్పాటు చేసుకోకపోవడంపై సందర్శకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తరువాతి రెండు రోజుల్లో జరపాల్సిన ఫెస్టివల్ ఏర్పాట్లయినా సరిగా పకడ్బందీగా ఏర్పాటు చేయాలని సందర్శకులు సూచిస్తున్నారు.

అనధికార నిర్మాణాలకు అడ్డే లేదా...?

జోన్ - 2లో క్రికెట్ స్టేడియం వెనుక భారీ అక్రమ నిర్మాణం

విశాలాంధ్ర - పీఎం పాలెం: జోన్ 2 మధురవాడ ప్రాంతంలో అనధికార నిర్మాణాలు అడుగడుగునా పుట్టగొడుగుల్లా వెలుస్తూనే ఉన్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారులు ముడుపుల మత్తులో అనధికార నిర్మాణాల జోలికి వెళ్లకుండా పోతున్నారు. ప్రభుత్వ భూముల్లో ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినా వారికి చలనం కలగడం లేదు. మరోపక్క ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మించినా కన్నెత్తి చూడడం లేదు. అనధికార అంతస్తులు నిర్మించుకుంటున్న బిల్డర్లకు, భవన యజమానుదారులకు భారీగా దళారీల ముడుపులతో చర్యలకు వెనుకాడుతున్నారు. 6వ వార్డు క్రికెట్ స్టేడియం వెనుక ఓ భారీ భవనంలో అనధికార అంతస్తు నిర్మాణం చేపట్టిన ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ భవనంపై భారీగా బిల్డర్ వద్ద ముడుపులు కాజేశారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. పేదోడు చిన్న షెడ్ వేసుకుంటే వాలిపోయే ప్లానింగ్ సెక్రటరీలు కూడా టౌన్ ప్లానింగ్ అవినీతిలో కూరుకుపోయారు. క్రికెట్ స్టేడియం - మైదానం పక్కన అనధికారికంగా ఫెంట్ హౌస్ నిర్మాణంపై ఫిర్యాదులు అందినా పట్టించుకోవడం లేదు. వీరికి జోనల్ కమిషనర్ అండదండలు కూడా ఉన్నాయని ప్రచారం సాగుతుంది. జోన్ -2 ప్లానింగ్ సెక్రటరీ అప్పారావు లీల అండతోనే ఈ భవనం నిబంధనలకు విరుద్ధంగా నిర్మితమైందని ప్రచారం సాగుతుంది.

డీఎస్ఎన్ఎల్‌యూ స్నాతకోత్సవం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం (డీఎస్ఎన్ఎల్‌యూ) 8వ, 9వ, 10వ, 11వ, 12వ బ్యాచ్‌ల సంయుక్త పట్టప్రదానోత్సవాన్ని బీచ్ రోడ్‌లోని నొవాటెల్‌లో నిర్వహించింది. వైస్-చాన్సలర్ ప్రొఫెసర్ (డాక్టర్) డి.సూర్యప్రకాశ్ స్వాగత ప్రసంగం చేసి, విశ్వవిద్యాలయ నివేదికను సమర్పించారు. ఈ వేడుకకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, డీఎస్ఎన్ఎల్‌యూ చాన్సలర్ ధీరజ్ సింగ్ ఠాకూర్ అధ్యక్షత వహించారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి సూర్యకాంత్, భారత సుప్రీంకోర్టు గౌరవనీయ న్యాయమూర్తి, డీఎస్ఎన్ఎల్‌యూ మాజీ చాన్సలర్ జె.కె. మహేశ్వరి, సుప్రీంకోర్టు గౌరవనీయ న్యాయమూర్తి డీఎస్ఎన్ఎల్‌యూ విజిటర్ పి.నరసింహ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశం ఆర్థిక శక్తి, న్యాయపాలన పట్ల నిబద్ధతతో ప్రపంచవ్యాప్తంగా తన స్థానం బలంగా నిర్మించుకుంటున్న ఈ కాలంలో పట్టభద్రులు సమాజానికి విశిష్టమైన సేవ చేయగలరని అన్నారు. న్యాయవృత్తి అత్యంత సవాళ్లతో కూడినదని, దీనికి మేధస్సుతో పాటు ఆత్మబలమూ అవసరమని వివరించారు.

సీఎస్ఆర్ అవార్డు గ్రహీతలుగా ఎన్ఎస్ఆర్ఐటీ అధ్యాపకులు

విశాలాంధ్ర - ఆనందపురం: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కౌన్సిల్ ఫర్ స్కిల్ అండ్ కాన్ఫిడెన్స్ ఇన్ వర్క్ ఎడ్యుకేషనల్ అవార్డు ప్రదానోత్సవంలో నడింపల్లి సత్యనారాయణ రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అధ్యాపకులు సీఎస్ఆర్ అవార్డు గ్రహీతలుగా నిలిచారు. విద్యార్థి విద్యాభ్యాసంలో ప్రోత్సాహకరంగా, మెంటరింగ్, మార్గదర్శనం చేయడంలో విశేష కృషి చేసినందుకు ఈ అవార్డు దక్కిందని కళాశాల చైర్మన్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శంభు ప్రసాద్ తెలిపారు. డా. పి.ఎస్.ఇ.నవీన్, ఇండస్ట్రీ-ఇనిస్టిట్యూట్ ఎంగేజ్‌మెంట్ హెడ్, అసోసియేట్ ప్రొఫెసర్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం, డా. బి.శివ ప్రసాద్, ప్రొఫెసర్, విభాగాధిపతి, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం, ఈ ప్రతిష్ఠాత్మక అవార్డులను అందుకున్నారు. సీఎస్‌సీ అకాడమీ ఇండియా డైరెక్టర్ రామ్మోహన్ ఈ అవార్డులను తమ సంస్థ తరపున అందజేయడం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ అవార్డులు జేఎన్‌టీయూ-జీవి, విజయనగరం ఉపకులపతి ప్రొఫెసర్ రాజలక్ష్మి సమక్షంలో అందజేయబడడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

SBFC

ఎస్‌బిఎఫ్‌సి ఫైనాన్స్ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్ : యూనిట్‌నం: 103, 1వ అంతస్తు, సి&బి స్క్వేర్, సంగం కాంప్లెక్స్, సిటిఎస్ నం.95ఎ, 127, అంధేరి కుర్లా రోడ్, చాకాల గ్రామం, అంధేరి(ఇ),ముంబై-400059 (టెలిఫోన్ : +91 22 67875300), ఫ్యాక్స్: +91 22 67875334 (WWW.SBFC.COM) కార్పొరేట్‌గుర్తింపుసంఖ్య:యు67190ఎంహెచ్2008పిటిసి178270

బహిరంగ ప్రకటన

దిగువ పేర్కొన్న బ్రాంచ్ చిరునామా వద్ద తాకట్టు పెట్టబడిన బంగారు ఆభరణాలు ఎస్‌బీఎఫ్‌సీ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా **తేదీ: 23 సెప్టెంబరు, 2025 - ఉదయం 10.30 గంటలకు కింది బ్రాంచ్ చిరునామాలో** వేలం వేయబడునని ఇందుమూలంగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయడమైనది. వేలం వేయబడు బంగారు ఆభరణాలు, బకాయిలు చెల్లించుటలో విఫలమైన మా యొక్క వేర్వేరు ఖాతాదారుల లోన్ ఎకౌంట్లకు చెందినవి. ఈ రుణగ్రహీతలకు మా నుంచి వేలం నోటీసులు సక్రమంగా జారీ చేయబడినవి. వేలానికి పెట్టిన బంగారు ఆభరణాలు...ఈ కింద పేర్కొన్న బ్రాంచి వివరాలతో పాటు వేర్వేరు ఖాతాదారుల కస్టమర్ ఐడీతో అనుసంధానమై ఉన్న అన్ని ఎకౌంట్లకు చెందినవి.

వైజాగ్ బ్రాంచ్ చిరునామా: ఎస్‌బీఎఫ్‌సీ ఫైనాన్స్ లిమిటెడ్, డోర్ నెం.43-9-205, గ్రౌండ్‌ఫ్లోర్, సుబ్బలక్ష్మీనగర్, రైల్వే న్యూకాలనీ, మోర్ సూపర్‌మార్కెట్ ఎదుట, విశాఖపట్నం-16, ఆంధ్రప్రదేశ్-530016, వైజాగ్ AP00277893, AP00278810, AP00354533, AP00567838, AP00612676, AP00625162, AP00647352, AP00647987, AP00649542, AP00665571, AP00675291, AP00675879, AP00678867, AP00682378, AP00683396, AP00686777, AP00761177, AP00775529

మరిన్ని వివరాల కొరకు, దయచేసి ఎస్‌బీఎఫ్‌సీ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క సంప్రదించు నంబరు(లు) : 18001028012 నందు సంప్రదించగలరు. (వేలం వేయబడు ఖాతాల సంఖ్యలు మార్చుటకు & ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండానే వేలాన్ని వాయిదా/రద్దు చేయుటకు ఎస్‌బీఎఫ్‌సీ ఫైనాన్స్ లిమిటెడ్ హక్కు కలిగియున్నది.)

నెల్లిముక్కు యూత్ ఆధ్వర్యంలో అన్న సమారాధన

విశాలాంధ్ర - పెదగంట్యాడ: నెల్లి ముక్కు యూత్ ఆధ్వర్యంలో నెల్లి ముక్కు రామాలయ ప్రాంగణంలో గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండపం వద్ద అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించిన నెల్లిముక్క యూత్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో నీలాపు అప్పన్న, పిట్ట నాగేశ్వరరావు, డిఎస్ఎన్ రెడ్డి, పులి చిన పెంటయ్య రెడ్డి, ఎంపాడ అప్పల రెడ్డి, యూత్ ప్రతినిధులు వై.ఆనందరెడ్డి, కెఎన్ రెడ్డి, పైడి రెడ్డి, మోహన్ రెడ్డి, గొందేసి అప్పల రెడ్డి, చుక్క అప్పల రెడ్డి పులి రాము,హరి, ఉమేష్ కనక రెడ్డి ఇతర సభ్యులు పాల్గొన్నారు.

అద్దెకి ఇల్లు ఇస్తే...

ఐదు లక్షలు బాకీ అంటూ ఇంటి యజమానిపై పెత్తనం



విశాలాంధ్ర - విశాఖ సిటీ: భర్తకు దూరంగా ఉంటున్న మహిళ కదా అని జాలిగా ఇల్లు అద్దెకు ఇస్తే, అద్దె చెల్లించకుండా తిరిగి తనకే ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని ఎదురు తిరుగుతున్న మహిళ వైనంపై బాధితులు పోలీసుల్ని ఆశ్రయించారు. ఇల్లు ఖాళీ చేయాలంటూ ప్రశ్నిస్తే తన పట్ల అసభ్యంగా ప్రవర్తించారంటూ తిరిగి రివర్స్ కేసు పెట్టేందుకు ప్రయత్నిస్తోందంటూ ఇంటి యజమాని శుక్రవారం శాంతిపురంలోని మీడియా ఎదుట స్పష్టం చేశారు. వివరాలిలా ఉన్నాయి. ముద్దాడ శంకర్ అనే వ్యక్తికి సీతంపేటలోని స్వాగత్ లాడ్జి సమీపంలో నాలుగు రేకుల షెడ్లు గల ఒక వ్యక్తిగత నివాసం ఉంది. అందులో ఒక పోర్షన్‌ను మూడేళ్ల క్రితం రూ.3వేల అద్దె ఒప్పందంపై ఒక మహిళకు ఇచ్చారు. కొన్నాళ్ల పాటు సరిగానే అద్దె చెల్లించిన సదరు మహిళ ఆ తర్వాత మరి చెల్లించడం మానేసింది. భర్త లేని మహిళగా, పిల్లలతో ఒంటరిగా ఉంటున్న స్త్రీమూర్తి కావడంతో ఇంటి యజమాని శంకర్ కొన్నాళ్ళు వేచి చూశారు. ఈ క్రమంలో కొన్నాళ్ల నుంచి ఆమె తీరుపై అనుమానం రావడంతో ఇక అద్దె చెల్లించలేదేమో అని అనుమాసం వచ్చి, తక్షణమే ఇంటిని ఖాళీ చేయాలంటూ ఒత్తిడి తెచ్చారు. అయినా సరే తనకు తిరిగి ఐదు లక్షల రూపాయలివ్వాలంటూ ఆ మహిళ డిమాండ్ చేయడంపై బాధితులు ద్వారకా పోలీసుల్ని ఆశ్రయించారు. పోలీసులు నచ్చజెప్పినా వినకుండా సదరు మహిళ..ఇంటి యజమాని ముద్దాడ శంకర్ కుటుంబ సభ్యులకు తాను రూ.5లక్షలు అప్పుగా ఇచ్చానని, ఆ డబ్బు ఇచ్చేస్తే వెళ్ళిపోతానంటూ చెబుతుండడంపై స్థానికులు కూడా ఆమె తీరును విభేదించారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో బాధితులు నేరుగా నగర పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో జరిగే పబ్లిక్ గ్రీవెన్స్ సెల్‌కు హాజరై తమ గోడు వెళ్లబోసుకుని, ఆధారాలు సమర్పించారు. దీంతో సీపీ బాగ్చీ కూడా ఈ విషయమై తక్షణమే ఇల్లు ఖాళీ చేయించాలంటూ స్థానిక పోలీసుల్ని ఆదేశించారు. పోనీ తను అప్పు ఇచ్చానని మహిళ చెబుతున్నట్టు, అందుకు ఆధారాలు కూడా లేవు. సాక్ష్యం కూడా లేకపోవడంతో పోలీసులు కూడా బాధితులకు అండగా ఉన్నారు. అయితే వీలు దొరికినప్పుడల్లా తన పట్ల ఇంటి యజమాని సహా వారి కుటుంబ సభ్యులు, బంధువులు అంతా కలిపి తన పట్ల అసభ్యంగా ప్రవర్తించారని, దురుసుగా వ్యవహరిస్తున్నారని మొసలి కన్నీరు పెట్టుకోవడం అందర్నీ ఆశ్చర్య పరుస్తోంది. మహిళను ప్రశ్నిస్తున్న శంకర్ బంధువు మహేష్ పైనా రివర్స్ కేసు పెడతానని బెదిరిస్తోందని బాధితులు మీడియాతో చెప్పారు. తాను హృద్రోగంతో బాధ పడుతున్నందు వల్లే ఇంటి వ్యవహారాల్ని మహేష్ కు అప్పగించాల్సి వచ్చిందని శంకర్ స్పష్టం చేశారు. బాధితులు తాము ఎదుర్కొంటున్న ఇబ్బందుల్ని స్థానిక నాయకుల వద్ద కూడా పంచాయతీ పెట్టగా వారూ ఏమీ చేయలేకపోయారని, మహిళ అనే ఒక ఒక్క కారణంతో తాము వేచి చూస్తున్నామని బాధితులు తెలిపారు. మరో విషయం ఏంటంటే సదరు మహిళ ఉంటున్న ఒక్క పోర్షన్ ల వైపు ఎవరైనా అద్దెకు వస్తున్నా వారిని రానీయకుండా చేస్తుందని బాధితులు ఆరోపించారు. ఆమెను అద్దె అడిగేందుకు ఎవరైనా వెళ్తుంటే మీ అంతు చూస్తానని, కేసులు బనాయస్తానని, తాను చెప్పినట్టు వినకుంటే కోర్టుకు ఈడుస్తానంటూ బెదిరిస్తోందన్నారు. అసలే శస్త్ర చికిత్స జరిగి తాను బెడ్ రెస్ట్ లో ఉంటే తనింట్లో అద్దెకు దిగిన మహిళే తమను పలు విధాలా ఇబ్బందులకు గురి చేయడాన్ని ఇంటి యజమాని శంకర్ ఓర్చుకోలేకపోతున్నారు. అందుకే తమకు న్యాయం చేయాలంటూ మీడియాను బాధితులు వేడుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో శంకర్ పాటు ఆయన బంధువు మహేశ్ కూడా పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా జీరు బాలరాజురెడ్డి

విశాలాంధ్ర - తగరపువలస: ఆర్ తాళ్లవలస జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (తెలుగు)గా విధులు నిర్వర్తిస్తున్న జీరు బాలరాజు రెడ్డి మాష్టారు విశాఖ జిల్లా "జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుని"గా అవార్డును స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశాఖ ఇన్చార్జి మినిస్టర్ బాల వీరాంజనేయ స్వామి, ప్రభుత్వ చీఫ్ విప్ చిరంజీవిరావు, విశాఖ పార్లమెంట్ సభ్యులు భరత్ జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ హరేంధీరప్రసాద్, జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్ కుమార్ హాజరై ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. బాలరాజు 2024 సంవత్సరంలో తెలుగు భాషా దినోత్సవ వేడుకల్లో "బోధనోపకరణాల తయారీ, వినియోగం"లో జిల్లా ప్రథమ బహుమతి పొందారు. మాస్టారుకు ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు రావడంతో స్థానికులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

భాస్కర్ విద్యా నికేతన్ స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవం

విశాలాంధ్ర - పెదగంట్యాడ: 70వ వార్డు చట్టివానిపాలెం భాస్కర్ విద్యా నికేతన్ స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా పాఠశాల డైరెక్టర్ పాలవలస భాస్కర్‌రావు సర్వేపల్లి రాధాకృష్ణ చిత్ర పటానికి

పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. విద్యార్థులకు సర్వేపల్లి జీవిత విశేషాలను వివరిస్తూ, నవ సమాజ నిర్మాణం, ఒక దేశ పురోభివృద్ధి ఉపాధ్యాయుల మీదనే ఆధారపడి ఉందని చాటి చెప్పిన మహనీయుడని కొనియాడారు. పాఠశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ చేతులు మీదుగా సీనియర్ ఉపాధ్యాయులు కె.మణి, కె.రాములను ఘనంగా సన్మానించారు. అనంతరం పాఠశాల సిబ్బంది అంతా కలిసి డైరెక్టర్ పి.భాస్కరరావు, కరెస్పాండంట్ పి. రమాదేవిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది శైలజ, అనూష, శంకర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

లడ్డూ వేలం దక్కించుకున్న కొక్కిరి అప్పన్న

విశాలాంధ్ర - భీమిలి: వినాయక నవరాత్రులు సందర్భంగా భీమిలి జోన్ 3వ డివిజన్ గొల్లవీధిలో వినాయక చవితి నవరాత్రులు సందర్భంగా ఉత్సవ కమిటీ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 10 కేజీల లడ్డూను స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు కొక్కిరి అప్పన్న 9,800 రూపాయలకు వేలంలో దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి అంటేనే యువతకు ఉత్సాహన్ని నింపుతుందని అన్నారు. తొమ్మిది రోజులుగా యువత ఎంతో ఆనందంగా, సంతోషంగా భక్తి శ్రద్దలతో జరుపుకొనే ఈ ఉత్సవాల్లో నేను భాగస్వామిని అయినందుకు ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. యువత భక్తితో పాటు సేవా కార్యక్రమాల్లో పాల్గొని సహచరులకు సేవలు అందించాలని కొక్కిరి అప్పన్న యువతకు విజ్ఞప్తి చేసారు.

29వ వార్డులో షెడ్ నిర్మాణ పనులకు శ్రీకారం

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా స్థానిక 29వ వార్డు పెంట వీధి స్కీమ్ బిల్డింగ్ ఏరియాలో డా బి. ఆర్ అంబేద్కర్ విగ్రహానికి షెడ్ వేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. శుక్రవారం ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ పెంట వీధి ఏరియాలో శంకుస్థాపన పనులకి చేరుకోగా స్థానికులు పూల మాలలు వేసి ఎమ్మెల్యే వంశీకి స్వాగతం పలికారు. ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి 29వ వార్డు పెంటవీధి స్కీమ్ బిల్డింగ్ ఏరియాలో 2 లక్షల రూపాయల సొంత నిధులతో డా"బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ రాజ్యంగా నిర్మాత డా"బి. ఆర్. అంబేద్కర్ విగ్రహానికి షెడ్ నిర్మాణం చేపట్టడం నాకు లభించిన అదృష్టం అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బుద్ధల అనురాధ ,జనసేన నాయకులు మన్యాల శ్రీనివాస్, 29వ కూటమి వార్డు ఇంచార్జి గొలగాని రవిశ్వరరావు, తెలుగుదేశం అధ్యక్షులు ఉరికిటి గణేష్, జనసేన వార్డు అధ్యక్షులు అంగటి శ్రావణ్ కుమార్, బిజెపి అధ్యక్షులు దేవాడ శేఖర్, పెంట వీధి హానరబుల్ ప్రెసిడెంట్ బుజ్జి,ఇశ్రాయేల్,ప్రెసిడెంట్ పైడిరాజు,సెక్రటరీ శివప్రసాద్,చలపతి మహిళలు పెంట లక్ష్మి,వర లక్ష్మీ,ఎర్నమ్మ, పూజిత కూటమి నాయకులు చిన్ని, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబి వేడుకలు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: జగత్ ప్రవక్త ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి 15వ శతాబ్ది జయంతి వేడుకైన ఈద్ ఏ మిలాద్-ఉన్-నబిని ముస్లిం సోదరులు విశాఖలో ఘనంగా జరుపుకున్నారు. సీరత్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలలో వివిధ మసీదులకు చెందిన ముస్లింలు నగరంలో భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. స్ప్రింగ్ రోడ్‌లోని రిజర్వులైన్ మసీదు వద్ద ప్రారంభమైన శాంతి ర్యాలీ డాల్ఫిన్ జంక్షన్, మహిళా కళాశాల జంక్షన్, సెవెన్ హిల్స్ జంక్షన్, జగదాంబ జంక్షన్ మీదుగా వన్ టౌన్ కోటవీధిలోని హజ్రత్ ఇషాక్ మదిని ఔలియా రహితుల్లాలై వారి దర్గా వరకు సాగింది. ర్యాలీలో ఇస్లామిక్ జెండాలు చేతబట్టిన చిన్నారులు, తెల్లటి గుర్రాలు, ఒంటెలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు ప్రవక్త సూక్తులను స్మరించు కున్నారు. ఈ సందర్భంగా సీరత్ కమిటీ అధ్యక్షుడు మునీర్ ఖాన్ బాబా ప్రధాన కార్యదర్శి జిలానీ, కోశాధికారి అసిఫ్, కార్పొరేటర్ బర్కత్ అలీ, కాంగ్రెస్ నేత హైదర్ అలీ సింకా, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇసాక్ వ్యవస్థాపకులు షబ్బీర్, రఫీ తదితరులు మాట్లాడుతూ నేడు సమాజం ఎదుర్కొంటున్న అన్ని సమస్యలకు జగత్ ప్రవక్త మహమ్మద్ రసూలుల్లా సల్లల్లాహు అలైహి వసల్లం వారు 1450 సంవత్సరాల క్రితమే పరిష్కారం చూపించారని ఆయన బోధనలు ప్రపంచ ప్రజలందరికీ ఆదర్శప్రాయ మన్నారు. ర్యాలీ అనంతరం ఇషాక్ మదిని ఔలియా రహమతుల్లా అలై వారి దర్గా వద్ద ముస్లిం మత గురువులు ఫాతిహా నిర్వహించారు. ర్యాలీకు హాజరైన ముస్లింలకు నిర్వాహకులు తబరుక్ పంపిణీ చేశారు. ర్యాలీ సందర్భంగా నగర పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

కమిషన్ల కోసమే వైద్య కళాశాలల ప్రైవేటీకరణ

- మెడికల్ కళాశాలల విషయంలో ప్రభుత్వంపై ధ్వజమెత్తిన కేకే రాజు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: కమిషన్ల కోసమే వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరిస్తోందని వైసిపి జిల్లా అధ్యక్షుడు కేకే రాజు ధ్వజమెత్తారు. శుక్రవారం వైసీపీ నగర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పీపీపీ పద్ధతి ద్వారా వైద్య కళాశాలలు ప్రైవేటీకరణ చేయడం ద్వారా పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం, వైద్య, విద్య దూరం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల చెంతకు వైద్యాన్ని తీసుకువచ్చిన ఘనత వై.యస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక రంగాలను ప్రైవేటీకరణ చేసే దిశగా ముందుకు సాగుతుందని, దానిలో భాగంగానే ఈరోజు రాష్ట్రంలో ఉన్న వైద్య కళాశాలను పిపిపి పద్ధతి ద్వారా ప్రైవేటీకరణ చేయడానికి క్యాబినెట్లో నిర్ణయం తీసుకుందన్నారు. ఇటువంటి ప్రభుత్వ చర్యలను తాము పార్టీ పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. వైద్య విద్యను పేద విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని గొప్ప సంకల్పంతో గొప్ప సంకల్పంతో జగన్మోహన్ రెడ్డి 17 మెడికల్ కళాశాలలకు అంకురార్పణ చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయడానికి పూనుకున్నారని ధ్వజమెత్తారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ప్రతి పేదవాడికి వైద్యం అందుబాటులో ఉండాలని ఉద్దేశంతో "జగన్ అన్న సురక్ష"అనే కార్యక్రమం ద్వారా ప్రతి సచివాలయ పరిధిలో ప్రత్యేక డాక్టర్లను ఏర్పాటు చేసి ఆ సచివాలయం సిబ్బంది ద్వారా ప్రతి ఇంటికి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి వారికి మెడిసిన్ ఇవ్వడంతో పాటు అనారోగ్యం ఎక్కువగా ఉంటే వారికి మెరుగైన వైద్యం అందజేసి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా చేసి ఈ రాష్ట్రంలో ఉన్న ప్రతి పౌరుడికి సంపూర్ణ ఆరోగ్య భద్రత కల్పించారు అని అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీ ద్వారా 5లక్షల వరకు మాత్రమే లబ్ధి ఇచ్చేవారని, వైసీపీ ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి ఆ లబ్ధిని 25 లక్షల వరకు పెంచారని అన్నారు. రోజు వైద్య విద్యను పేద ప్రజలకు దూరం చేయాలని దురుద్దేశంతో ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ క్యాడర్ సిద్ధం కావాలి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ క్యాడర్ సిద్ధం కావాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ అరికెల అరుణ కుమారి అన్నారు. కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రియాంక దండి ఆధ్వర్యంలో బీచ్ రోడ్డు కిర్లంపూడి లేఔట్‌లో గల పార్టీ కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా జిల్లా ఇన్‌చార్జ్ అరికెల అరుణ కుమారి పాల్గొని నియోజకవర్గంలో పార్టీ బలోపేతంపై పలు సూచనలు చేసారు. ప్రియాంక నియోజకవర్గంలో ఉన్న సమస్యలు ఆమెకు చెప్పారు. వార్డు కమిటీలు పూర్తి చేశామని, పార్టీని స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం చేస్తున్నామని ఆమె తెలిపారు.సమావేశంలో డీసీసీ అధ్యక్షులు అడ్డాల వెంకట వర్మ, పార్టీ సీనియర్ నాయకులు చిన్నబాబు, ఉమ్మిడి భాస్కర్, కల్పన, కాండవ గాయత్రి, వార్డు అధ్యక్షులు చింతపల్లి వెంకటేష్,ఆడారి ప్రేమ్ కుమార్, గుర్రం కనకరాజు, వేమూరి సురేష్, సింబాల విజయ్,భోగవరపు విగ్నేశ్వర శ్రీనివాస్, ఎల్లపు రామ్ సంజీవ్,ఈగల మోహన్ సాయి, వరాలమ్మ,అసిరి నాయుడు, బోనుల గణేష్, ఏన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు శిరీష కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూర్ణ మార్కెట్ దుర్గాలమ్మ ఆలయానికి ఏ.సి వితరణ

అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన వాసుపల్లి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: దక్షిణ నియోజకవర్గంలో ప్రజల కొంగుబంగారం శ్రీ దుర్గాలమ్మ ఆలయానికి మాజీ ఎమ్మెల్యే, వైఎస్ఆర్సిపి సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమారుడు వాసుపల్లి సాకేత్ రూ.50వేల విలువగల ఏసీ వితరణ చేశారు. దక్షిణ నియోజకవర్గ వైసీపీ శ్రేణులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ నిర్వహకులకు రెండు టన్నుల సామర్థ్యం కలిగిన సాంసంగ్ ఎయిర్ కండిషన్‌ను భక్తుల సౌకర్యార్థం కుమారుడు సాకేత్ చేతుల మీదగా బహుకరించారు. వాసుపల్లి గణేష్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరి మీదా ఉండాలని కోరుకుంటూ పూజలు చేశామన్నారు. దక్షిణ నియోజక వర్గం ప్రజల ఆరాధ్య దైవం శ్రీ దుర్గాలమ్మను నమ్మిన భక్తులకు వారాలిచ్చే శాంత రూపంలో, దుర్బుద్ధితో చూసేవారికి ఉగ్రరూపంలో దర్శనం ఇస్తారన్నారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా అమ్మవారి ఆశీస్సులతో ప్రజలకు సేవ చేసానని వాసుపల్లి అన్నారు. ఆ చల్లని తల్లి ఆశీస్సులు దక్షిణ నియోజకవర్గ ప్రజలను ఉండి కాపాడాలని వాసుపల్లి కోరారు. ఈ కార్యక్రమంలో వైయస్ఆర్సీపీ వార్డు అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్య, వైద్యం పేదలకు దూరం చేయడమే కూటమి విధానమా ?

- విజయనగరం జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: విద్యా వైద్యం పేదలకు దూరం చేయడమే కూటమి విధానమా అని విజయనగరం జడ్పీ చైర్మన్, భీమిలి నియోజకవర్గం వైసీపీ ఇన్చార్జ్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను), ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శుక్రవారం ఎండాడ వైయస్సార్ పార్టీ కార్యాలయంలో చిన్న శీను జన్మదిన వేడుకలను నిర్వహించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉన్నతమైన లక్ష్యంతో గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మెడికల్ కాలేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. ప్రతి మెడికల్ కాలేజ్ పరిధిలో ఒక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఏర్పాటు చేసి, ప్రతి పేదవారికి వైద్య విద్య, మెరుగైన వైద్యం చేరువ కావాలని నాడు వైఎస్ జగన్ పరితపించారన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటుకి అప్పగించి, పేదలకు వైద్యవిద్యను, వైద్యాన్ని దూరం చేస్తున్న ఈ చర్యలను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఉండాలన్నది నాటి మా ముఖ్యమంత్రి వైయస్ జగన్ లక్ష్యం అని, అటువంటి గొప్ప లక్ష్యాలకు కూటమి ప్రభుత్వం తూట్లు పొడవడం బాధాకరంగా ఉందన్నారు. మరోవైపు సంక్షేమ పథకాలకు పాత విధించి కొన్నింటిని పూర్తిగా ఎత్తేసి పేదల పట్ల ప్రభుత్వానికి ఉన్న అక్కసు ను

చాటుకుంటుందని విమర్శించారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలో సెప్టెంబర్ నెల వచ్చినా అడ్మిషన్లకు నోచుకోలేదు, ఇటువంటి చర్యలతో పరోక్షంగా కార్పొరేట్ విద్యాసంస్థలకు కూటమి ప్రభుత్వం కొమ్ము కాస్తుందని రుజువు అవుతుందన్నారు. ప్రభుత్వం విద్యారంగం పట్ల నిర్లక్ష్యం వహిస్తుందని, దీనితో డ్రాప్స్ శాతం పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే విద్య, వైద్యాన్ని పేదలకు ఉచితంగా అందించాలని వైసిపి డిమాండ్ చేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం మరోసారి పునరాలోచించుకోవాలని, విద్య వైద్య రంగాలను కార్పొరేట్ పరం చేసే ఆలోచనలను విరమించుకోవాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - ఆనందపురం: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జోన్ 3 సింహాచలం నాయుడు ఆదేశాల మేరకు ఆనందపురం మండలంలో ఆదివారం బోని 33/11కెవి, సిర్లపాలెం 11 కెవి లైన్లో మెయింటినెన్స్, చెట్లు తొలగింపు కొరకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు శిర్లపాలెం, బోని ఏజీయల్, బోని హెడ్ క్వార్టర్స్, ముకుందపురం, ఎస్సార్ కాలనీ, పేకేరు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాయకు అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ ఏఈ అప్పలనాయుడు తెలిపారు.

మధురవాడలో నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

విశాలాంధ్ర - మధురవాడ: విద్యుత్ 11కేవీ ఎన్టీఆర్ నగర్ ఫీడర్, మధురవాడ సబ్ స్టేషన్లో గల 11కేవీలైన్ల మరమ్మతులతో పాటు లైన్లను తాకుతున్న చెట్ల కొమ్మలను తొలగించు కార్యక్రమాల నిమిత్తము శనివారం ఉదయం 9గం. ల నుండి మధ్యాహ్నం 2 గం.ల వరకు ఈ దిగువ ప్రాంతాలలో విద్యుత్ నిలుపుదల చేయడం జరుగు తుందని విద్యుత్ జోన్111 మధురవాడ, ఆపరేషన్ ఏ.ఈ. బి.సింహాచలం నాయుడు తెలిపారు. .కే.2 కాలనీ, కే1 కాలనీ, కే3 కాలనీ, నవోదయ స్కూల్, డీఆర్కటౌన్ షిప్, అన్నంరాజు నగర్, సాయి చంద్ర లేఅవుట్, గాయత్రి కాలేజ్ కో ఎడ్యుకేషన్, అష్ట లక్ష్మీ టెంపుల్ తదితర ప్రాంతాలు, మధురవాడ సబ్ స్టేషన్ ఫీడర్ పరిధిలో... పోర్టు కాలనీ, ఎన్జీఓ కాలనీ, సుద్దగెడ్డ ప్రాంతం, వాంబేకాలనీ, శ్రీనివాసనగర్, చంద్రంపాలెం, మధురవాడ మేన్ రోడ్, దుర్గానగర్ 1,2,ల తోపాటు కృష్ణానగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ప్రకృతి వ్యవసాయంలో మెలకువలు పాటించాలి

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం తర్లువాడ గ్రామంలో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీష్గఢ్,గుజరాత్‌కి చెందిన నాలుగు రాష్ట్రాల అగ్రికల్చర్ అధికారులు నార్త్ కోస్టల్ జిల్లా అధికారి హేమసుందర్ పర్యటించారు. ప్రకృతి వ్యవసాయంలో సాగు చేస్తున్న మోడల్స్ పీఎండీఎస్ పరిశీలించారు. తర్లువాడలో శ్రీనివాస చక్రవర్తి రైతు పొలంలో ఏటీఎం మోడల్‌లో సాగు చేస్తున్న విధానాన్ని చూసి రైతులు అనుభవాలు తెలుసుకోవడం తెలుసుకున్నారు. రామారావు కూరగాయలలో ఏ గ్రేడ్ మోడల్ విధానంలో సాగు చేస్తున్న విధానాన్ని పద్ధతులు సాగు చేయడం వలన భూమి ఆరోగ్యం పురుగులు తెల్లుళ్లు బెడద తగ్గి 365 రోజులు పాటు రైతులకి ఆదాయం పొందవచ్చు అని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమానికి రైతులు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.